ఆశీర్వాద్ సక్సేనాకు కాంస్యం



చార్మినార్: ఉత్తరాఖాండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ ఆటల పోటీల్లో శాలిబండ సైక్లింగ్ క్లబ్ విద్యార్థి ఆశీర్వాద్ సక్సేనా కాంస్య పతకం సాధించారు. గత నెల 28 నుంచి ఈ నెల 14 వరకు జరుగుతున్న ఈ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ స్టేట్ సైక్లింగ్ అసోసియేషన్ తరఫున శాలిబండ సైక్లింగ్ క్లబ్ స్టూడెంటైనా ఆశీర్వాద్ సక్సేనా 120 కిలోమీటర్ల దూరం జరిగిన మాస్ స్టార్ట్ రోడ్ రేస్ పోటీలో విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం తరఫున కాంస్య పతకం సాధించిన ఆశీర్వాద్ సక్సేనాను తెలంగాణ స్టేట్ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పి. మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.విజయ్‌కాంత్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.దత్తాత్రేయ తదితరులు ఆశీర్వాద్ సక్సేనాను అభినందించారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం



గన్‌ఫౌండ్రీ: ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడాన్ని పురస్కరించుకొని హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లీ శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్.గైబువల్లీ మాట్లాడుతూ..మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం మాదిగలతో పాటు అనగారిన వర్గాలకు దక్కిన గౌరవమని సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రాల్లో అనేక సంక్షేమ పథకాలతో పాటు సామాజిక సమస్యలపై ఆయన చేసిన పోరాటం అభినందనీయమని కొనియాడారు.

జ్ఞాన సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



సంతోష్‌నగర్: బ్రహ్మప్రకాశ్ డీఏవీ పాఠశాలలో జ్ఞాన సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ శనివారం ఘనంగా జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్త ఉడుగు రవి కుమార్, మానస దంపతులు ఈ విగ్రహాన్ని పాఠశాలకు అందించారని పాఠశాల ప్రిన్సిపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్ రావు, డీఏవీ పాఠశాల ఏఆర్‌ఓ ఆనందవల్లి, పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఎస్.ప్రశాంత్, ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు

అబిడ్స్: సైబర్ నేరాలపై గుడిమల్కాపూర్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాంసింగ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు వాడితే నష్టాలపై, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు వివరించారు. ఇన్‌స్పెక్టర్ బి.రాజు మాట్లాడుతూ..ప్రస్తుత ఆధునిక టెక్నాలజీలో కొంత మంది మాయగాలు సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయకులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. ప్రతి అంశంపై విద్యార్థులకు చిన్నపటి నుంచే అవగాహన ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తరచూ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

‘ఢిల్లీలో బీజేపీ అక్రమాలు, దౌర్జన్యాలు’

గోల్కొండ: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలకు పాల్పడుతూ దౌర్జన్యాలు చేస్తూ గెలిచిందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ ఆరోపించారు. ఢిల్లీలో బీజేపీ గెలుపుపై ఆయన మాట్లాడుతూ..పదేళ్లుగా ప్రజామోదంతో ఢిల్లీని పాలిస్తున్న ఆప్ నాయకులను బీజేపీ ప్రభుత్వం అరెస్టులు చేస్తూ అధికారాన్ని దుర్వినియోగం చేసుకుందన్నారు. కాంగ్రెస్ నాయకులను భయపెట్టించి వారు ఓడిపోయేలా కుట్రలు పన్నిందని ఆరోపించారు.



దోర్‌బస్తీలో గ్లౌస్‌ల తయారీ యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికులు



మెషిన్‌పై తయారు చేస్తున్న వస్తువులు

నాడు వ్యవస్థాపకులు.. నేడు కూలీలు!

- గతంలో లిడ్‌కాప్ సంస్థ పరిశ్రమలతో దళిత చర్మకారులకు ఉపాధి
- 15 ఏళ్ల వరకు లిడ్‌కాప్ కొనసాగింపు

జియాగూడ: నాడు చర్మకారులకు శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించిన లిడ్‌కాప్ భవిష్యత్‌లో ముందు తరాలకు బాసటగా నిలుస్తుందని భావించారు. జియాగూడ దళిత వాడల ప్రజలకు శిక్షణ ఇచ్చారు. మొదట్లో ఆర్థికంగా ఎదుగుదల చూపించిన చర్మకార వస్తువులు క్రమేణా ప్లాస్టిక్, ఫైబర్ వస్తువులు మార్కెట్‌లోకి రావడంతో ఆదరణ తగ్గింది. 1973 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం దళితుల ఆర్థికాభివృద్ధి కోసం తోళ్లతో తయారయ్యే వస్తువుల సంస్థను జియాగూడ లీడ్‌కాప్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ సంస్థ)ను నెలకొల్పారు. జియాగూడలో అధికంగా ఉండే దళితులకు ఉచితంగా శిక్షణలు ఇచ్చి ఉపాధి, ఆర్థిక సహాయం, స్వతంత్ర ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేసి వారిని వ్యవస్థాపకులుగా మార్చడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి లాంటి ఎన్నో లక్ష్యాలతో స్థాపించారు. కానీ 15 సంవత్సరాలలోపే మూత పడ్డాయి. కంటి తుడుపు చర్యగా రోడ్డు ఫుట్‌పాత్‌లపై లిడ్‌కాప్ డబ్బాలకు అనుమతులు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది.

శిక్షణ పొందిన వారు కూలీలుగా..

లిడ్‌కాప్ సంస్థలో శిక్షణ పొందిన దళితులు, మహిళలు కూలీలుగా మారారు. అప్పటి ప్రభుత్వం ఎన్నో ఆశయాలతో జియాగూడలో ఏర్పాటు చేసింది. శిక్షణ అనంతరం సరైన ఉపాధి, స్వతంత్ర ఉత్పత్తి యూనిట్లకు ఆర్థిక సహాయం అందించలేకపోయింది. ముఖ్యంగా లిడ్‌కాప్‌లతో లెదర్ బ్యాగ్స్, గ్లౌజ్, బెల్ట్‌లు, సైకిల్ కిట్లు తదితర తయారీ కోసం కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చి జియాగూడ లిడ్‌కాప్ సంస్థలో నేర్చుకున్నారు. అయితే సరైన ప్రోత్సాహం ప్రభుత్వం నుంచి లభించక దినసరి కూలీలుగా మారారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్నారు. ప్రస్తుతం ఎంతో మంది లిడ్‌కాప్‌లో శిక్షణ పొందిన కార్మికులు చనిపోయారు. తోళ్ల వస్తువుల తయారీని పిల్లలు నేర్చుకొని కొనసాగిస్తూ దినసరి కూలీలుగా నేటికీ కొనసాగుతున్నారు.



విక్రయానికి ఉంచిన తోళ్ల చెప్పులు

లెదర్ పరిశ్రమలను ప్రోత్సహించాలి..



పెత్తందారుల చేతుల్లోకి వెళ్తున్న తోళ్ల ఉత్పత్తులను లిడ్‌కాప్‌లను స్థాపించి గతంలో తరహా దళితులకు ట్రెనింగ్, ఉపాధి, ఆర్థిక సహాయం అందించాలి. అప్పుడే దళితుల అభ్యున్నతికి సాధ్యమవుతుంది. – అమీత్, దినసరి కూలీ

లేబర్ కార్డులు ఇవ్వాలి..



దళిత చర్మకారులు ముఖ్యంగా డోర్ సమాజ్, దళితులకు ప్రభుత్వం లేబర్ కార్డులను ఇవ్వాలి. దీని ద్వారా వారికి ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఇతర అన్ని రకాల లాభాలు అందుతాయి. ముఖ్యంగా పరిశ్రమల శాఖ మంత్రి చొరవ చూపాలి.

– వెంకటేష్ యాదవ్,
బీజేపీ జియాగూడ ప్రధాన కార్యదర్శి

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ గౌడ్

విజయనగర్‌కాలనీ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణగౌడ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్, విజయనగర్‌కాలనీ, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు. అంతేకాకుండా వాహనాలకు నెంబర్ ట్యాంపరింగ్ చేసేవారిపై కేసులు బుక్ చేశారు. 16 కార్లకు బ్లాక్ ఫిల్మ్ తొలగించడంతో పాటు 4 మల్టీటోన్ హారన్స్ తొలగించి ఓ బుల్లెట్ వాహనానికి ఉన్న సైలెన్సర్‌ను తీసివేసి కేసులు బుక్ చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ.సామయ్య, మహ్మద్ షకీల్‌లతో పాటు ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్‌కు శాంతి కమిటీ సభ్యులు సత్కరించారు. అలియాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కమిటీ సభ్యులు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, విజయ్ కుమార్, వెంకటేష్‌యాదవ్, ఆర్.మధు తదితరులు ఆయనకు పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు.



నిత్యావసర సరుకుల పంపిణీ

నాంపల్లి: అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు నాయకత్వంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి పుట్టిన రోజు వేడుకలను శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు నిత్యావసర సరుకులను కేవీ రమణాచారి చేతుల మీదుగా అందజేశారు. సమాజంలో అభాగ్యులకు అండగా నిలిచి సమాజ సేవకు అంకితం కావాలని రమణాచారి యువతకు పిలుపునిచ్చారు.



సరుకులు పంపిణీ చేస్తున్న కేవీ రమణాచారి

కళలతో మానసిక ఉల్లాసం

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిళ్లను తగ్గించి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు కళలు దోహదపడతాయని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.గంగాధర్ అన్నారు. శనివారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు అంజి ఆకొండి ఆధ్వర్యంలో మాస్టర్ స్ట్రోక్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రత్యేక అభిరుచి కలవారు మాత్రమే కళల్లో రాణిస్తారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా బెంగాల్, కేరళ, చెన్నై, బెంగళూర్ తదితర ప్రాంతాలకు చెందిన 53 మంది ప్రముఖ చిత్ర కళాకారుల కుంచెల నుంచి జాలువారిన కళాఖండాలు ఈ ప్రదర్శనశాలలో ఆకట్టుకుంటున్నాయన్నారు. ఈ ప్రదర్శన ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు తిలకించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంఎల్ ఆనంద్‌రావు, నెహ్రూ ఆర్ట్ గ్యాలరీ ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ గుర్రం మల్లేశం, యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్‌లతో పాటు ప్రముఖ కళాకారులు శివప్రసాద్, ఉదయ్‌కుమార్, అబ్దుల్ రాజాహుస్సేన్, కళాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంగాధర్

బీజేపీ నేతల సంబరాలు

చార్మినార్: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారనడానికి ఢిల్లీలో తమ పార్టీ సాధించిన ఘన విజయమే నిదర్శనమని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు సి.కృష్ణ యాదవ్ అన్నారు. ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై బీజేపీ సీనియర్ నాయకుడు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో శనివారం పాతబస్తీ దారుషిఫాలో వాహనదారులకు, ప్రయాణికులకు, పాదచారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అలీ గుట్కీ, దినేష్, నిస్సార్ అహ్మద్, షబ్బీర్ అలీ, నాయకురాళ్లు వీరమణి, లక్ష్మి పాల్గొన్నారు.



మిఠాయిలు పంచిపెడుతున్న మాజీ మంత్రి కృష్ణయాదవ్, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద..

గోల్కొండ: ఢిల్లీ పీఠంపై బీజేపీ ప్రభుత్వం రావడం ఆప్ ప్రభుత్వ అరాచకాలకు ప్రజల తీర్పు అని కార్వాన్ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. ఢిల్లీలో బీజేపీ గెలుపు సందర్భంగా దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద కార్వాన్ బీజేపీ అధ్యక్షులు ఉద్దడి జగదీష్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. అదే విధంగా గుడిమల్కాపూర్ పూలే విగ్రహం వద్ద బీజేపీ నాయకులు దేవర వంశీ ఆధ్వర్యంలో ఢిల్లీ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.

అబిడ్స్ కట్టెల మండిలో..

అబిడ్స్: న్యూ ఢిల్లీలో బీజేపీ విజయదుందుబి మోగించడంతో అబిడ్స్ కట్టెల మండిలోని బీజేపీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, గోషామహల్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు, కార్పొరేటర్ లాల్ సింగ్ ఇతర నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు.



దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద సంబరాల్లో ఉద్దడి, అమర్‌సింగ్



సంబరాల్లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, ఆల పురుషోత్తమ్‌రావు

సర్కిల్ జిగేల్

విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న రెయిన్‌బజార్ సర్కిల్



యాకుత్‌పురా: రెయిన్‌బజార్ డివిజన్ ప్రధాన సర్కిల్ చెత్తాచెదారాన్ని తొలగించి అందంగా సుందరీకరించారు. ఎస్సార్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన రెయిన్‌బజార్ బ్యూటిఫికేషన్ రంగు రంగుల విద్యుత్ దీపాలతో కళకళలాడుతోంది. స్థానిక బస్తీలు, కాలనీల్లో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్సార్టీ కాలనీలోని చెత్త వేసే స్థలాన్ని శుభ్రపరిచి అక్కడ రూ.14 లక్షలతో పచ్చని గడ్డి, మొక్కలు, జంతువుల బొమ్మలతో వేల్‌కాం టూ రెయిన్‌బజార్ నిర్మించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన బ్యూటిఫికేషన్ నిర్మాణ పనులను ఇటీవల ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు..



గ్రేటర్‌లోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నా. ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి డివిజన్‌లో ప్రధాన సర్కిల్‌లోని చెత్తను తొలగించి రూ.14 లక్షల నిధులతో అందంగా నిర్మించి వేల్‌కాం టూ రెయిన్ బజార్ ఏర్పాటు చేసి సుందరీకరించాం.

– మహ్మద్ వసీవుద్దీన్,
కార్పొరేటర్ రెయిన్‌బజార్

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టోలిచౌకీ చౌరస్తా వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించానన్నారు. మరో వైపు కార్వాన్, లంగర్‌హౌస్ డివిజన్‌లలో సైతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచామన్నారు. ప్రభుత్వ స్థలాల కబ్జా, అక్రమ నిర్మాణాలను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా టోలిచౌకీ చౌరస్తా వద్ద నదీమ్ కాలనీ, అక్బర్‌పురా కాలనీలకు చెందిన వారు ఎమ్మెల్యేను కలిసి కొత్త రేషన్ కార్డులపై ఫిర్యాదు చేశారు. మీసేవా కేంద్రాల్లో రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ప్రకటనలు వచ్చాయని అయితే సైట్ క్లోజ్ అయిందని మీసేవా కేంద్రాల నిర్వాహకులు అంటున్నారన్నారు. ఈ విషయమై ఆందోళన చెందకుండా ఓపిక పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.



టోలిచౌకీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ కార్డు తప్పనిసరి



గోల్కొండ: ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ గుర్తింపు కార్డులు తప్పనిసరి అని గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీర్ అన్నారు. శనివారం గోల్కొండ డిప్యూటీ ఐవోఎస్ కార్యాలయంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన అపార్ కార్డు ప్రాధాన్యంపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనందరికీ ఆధార్ కార్డు, పాన్ కార్డు ఎలాంటివో విద్యార్థులకు అపార్ కార్డు అంతే ప్రాముఖ్యత గలదన్నారు. ఈ కార్డులో విద్యార్థికి సంబంధించిన వివరాలన్ని నమోదై ఉంటాయని ఆయన తెలిపారు. అపార్ ఐడీ నమోదులో వివరాలన్ని పారదర్శకంగా ఉండాలని జనన ధ్రువపత్రం, ఆధార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలన్ని సరిగ్గా ఉండాలన్నారు.

పోటాపోటీగా చెస్ పోటీలు

చార్మినార్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ మన్‌మోహన్ సింగ్ మెమోరియల్ స్కూల్ చెస్ టోర్నమెంట్–2025 పోటాపోటీగా జరిగాయి. మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో శనివారం ఈ పోటీలు తొమ్మిది రౌండ్లలో స్విస్ ఫార్మేట్‌లో జరిగాయి. 120 మంది విద్యార్థులు 60 జోడీలుగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను సుల్తాన్–ఉల్–ఉలూం ప్రిన్సిపాల్ రహిమా బేగం ప్రారంభించి విద్యార్థుల ఆట తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యాభ్యాసంతో పాటు చెస్ లాంటి క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. హుస్సేనీ ఆలం, టప్పా చబుత్రా, బాబానగర్, గోల్కొండ, మహేంద్రాహిల్స్, మలక్‌పేట్, చార్మినార్, సికింద్రాబాద్, మెహదీపట్నం, బేగంపేట్, సనత్‌నగర్ తదితర ప్రాంతాలలోని పలు ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ, డైరెక్టర్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రహిమా బేగం, సొసైటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ

గొప్ప సాహితీవేత్త రమణాచారి



రమణాచారిని సన్మానిస్తున్న కాందూరి కృష్ణమాచారి

సుల్తాన్‌బజార్: డాక్టర్ కేవీ రమణాచారి గొప్ప సాహితీవేత్త అని తెలంగాణ అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మాజీ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి జన్మదినం సందర్భంగా శనివారం ఆయన నివాసంలో అర్చక ఉద్యోగ జేఏసీ, నాయకులు, వివిధ వికలాంగుల సంఘాల నాయకులు కలిసి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ.. తెలంగాణలో బ్రాహ్మణ సమాజం కోసం రమణాచారి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, జర్నలిస్టులు, సాహితీవేత్తలు కళాకారులు, రచయితలు పాల్గొన్నారు.

అధునాతన యంత్ర పరికరాల వితరణ

నాంపల్లి: కేన్సర్ వ్యాధి నిర్ధారణకు అధునాతన యంత్ర పరికరాలను అందజేశామని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఉదయ్ పిలానీ తెలిపారు. శనివారం రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ దాతల నుంచి సేకరించిన నిధులతో రూ.42 లక్షల విలువైన కేన్సర్‌ను నిర్ధారించే అల్ట్రా సౌండ్ మిషన్ ద్వారా గర్భ సంచి సమస్యలను నిర్ధారించే మిషన్లను అంకాలజీ విభాగం వైద్యులు డాక్టర్ రాధిక, డాక్టర్ కె.ప్రకాష్, శ్రీకాంత్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ పిలానీ మాట్లాడుతూ..కేన్సర్ చికిత్సల కోసం ఎంఎన్‌జేలో అధునాతన వైద్య పరికరాల అవసరం ఎంతో ఉందని గ్రహించిన రోటరీ క్లబ్ రెండు మిషన్‌లను అందజేయడం జరిగిందన్నారు. క్లబ్ సభ్యులు సురేన్ పోరూరి మాట్లాడుతూ..ఐదేళ్లుగా రోటరీ క్లబ్ ఎంఎన్‌జే ఆసుపత్రికి సుమారు రూ.ఐదు కోట్ల విలువ గల పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ రమణ దేవరకొండ, నంబూరి వెంకటరాజు, మదన్‌మోహన్, పీవీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్ మిషన్లను ప్రారంభిస్తున్న ఉదయ్ పిలానీ